

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర, అధికారులు

రవాణా చార్జీలు ఎక్కడ..?



- రూ. 6.77 కోట్లు చెల్లించామంటున్న సివిల్ సప్లయ్ అధికారులు
- సుమారు రూ. 3 కోట్లు మోసం జరిగిందంటూ ఆరోపణలు
- రైతుల అవసరాన్ని ఆదాయంగా మలుచు కుంటున్న నిర్వాహకులు

ములుగు, మే 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు రైతుల అకౌంట్లలో జమ చేసిన ప్రభుత్వం రవాణా చార్జీలు ఇంకా చెల్లించలేదు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన వాహనాలు అందుబాటులో లేక రైతులే సొంత ఖర్చులు పెట్టుకుని మిల్లులకు ధాన్యాన్ని రవాణా చేశారు. సుమారు ఐదు నెలలైనా రవాణా డబ్బులు రాక రైతులు ఎదు రుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహ కులతో, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టర్లు కుమ్మక్కై తమ జేబులకు చిల్లులు పెడుతున్నా రని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా కిరాయి చెల్లించి నేరుగా మిల్లులకు తరలించిన ధాన్యాన్ని లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు వారి లారీల్లో రవాణా చేసినట్లు ట్రక్ షీట్ చూపించి వారి ఖాతాల్లో జమచేసు కుంటున్నారని చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్టర్లకు రవాణాకు సంబంధించిన డబ్బులు చెక్కుల ద్వారా పూర్తిగా చెల్లించామని సివిల్ సప్లై అధి కారులు చెబుతున్నప్పటికీ ట్రాన్స్‌పోర్టర్‌లు రవాణా చార్జీలు తమకు ఇంతవరకూ ఇవ్వలే దని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై అధికారులు చెక్కులిచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ. 6.77కోట్లు రవాణా చార్జీల చెల్లించిన అధికారులు

గత వర్షాకాలంలో (అక్టోబర్-2024 నుంచి మార్చి-2025 వరకు) అన్నదాతలు పండించిన 1,31,459.120 టన్నుల వరి ధాన్యాన్ని కొను గోలు చేసేందుకు సివిల్ సప్లయ్ అధికారులు ములుగు జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు 166 కేంద్రాల ద్వారా కొనుగోళ్లను చేపట్టారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు 3 సెక్టార్లలో లారీ ట్రాన్స్‌పోర్టర్లను టెండ ర్లకు ఆహ్వానించారు. ఈ టెండర్‌ను ములుగు లారీ అసోసియేషన్, నాగేంద్ర లారీ ట్రాన్స్‌పోర్టు వారు దక్కించుకున్నట్లు సివిల్ సప్లయ్ అధి కారులు తెలిపారు. అయితే వర్షా కాలంలో సెక్టార్-1 ద్వారా 44,829.480 టన్నులు, సెక్టార్-2 ద్వారా 37,401.320 టన్నులు, సెక్టార్-3 49,228.320 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు అధికారిక లెక్కలు చెబుతు న్నాయి. మొత్తంగా 1,31,459.12 టన్నుల ధాన్యానికి సివిల్ సప్లయ్ అధి కారులు రవాణా చార్జీల కింద 2 శాతం జీఎస్టీ పోగా రూ.6,77,18,000ను చెక్కుల ద్వారా చెల్లించామని తెలిపారు.

అన్నదాతలకు అందని ధాన్యం తరలింపు బకాయిలు

రైతుల అవసరాన్ని ఆసరాగా..

రైతుల అవసరాన్ని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, మిల్లర్లు ఆదాయంగా మలుచుకుంటు న్నారు. మూకుమ్మడిగా రవాణా సొమ్మును వారి జేబుల్లో వేసుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది వర్షాకాలం అయినందున ఎప్పుడు వర్షం పడి తమ ధాన్యం తడిసి పోతుందోనని భయాందోళనకు గురైన రైతులు ట్రాక్టర్ల ద్వార, ట్రక్కుల ద్వారా వేరే ఇతర వాహనాలలో వరి ధాన్యాన్ని మిల్లు లకు తరలించారు. అయితే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు ఆ వాహనాల నంబర్లను ట్రక్ షీట్లలో నమోదు చేయకుండా ట్రాన్స్‌పోర్ట్ లారీ నంబర్‌ను నమోదు చేసి వారి ఖాతా ల్లోకి జమచేసుకున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. ఎవరైనా రైతు ప్రశ్నిస్తే అతడి ట్రాక్టర్ నంబర్ నమోదు చేసి అతడికి ఎంతో కొంత ముట్టచెప్పి అతడి నోరు మూయిస్తు న్నారు. సదరు ట్రాక్టర్ యజమాని పేరిట మరో నాలుగు ట్రిప్పులు అదనంగా రాసి ఆ సొమ్మును నొక్కేస్తున్నారని పలువురు చెబుతు న్నారు. ఈ తతంగమంతా ప్రభుత్వ అధికారు లకు తెలిసినప్పటికీ మామూలుగా తీసుకుం టున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వర్షాకాలం సీజన్‌లో 39 రైస్ మిల్లులకు తర లించిన ధాన్యం వివరాలు, రవాణా చేసిన లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల వివరా లను జిలా కలెక్టర్ పరిశీలిస్తే అసలు దొంగల బాగోతం బట్టబయలవుతుందని పలు రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

ధాన్యం తరలింపు సొమ్ము ఎవరి జేబుల్లోకి ..?

ప్రభుత్వం చెల్లించిన ధాన్యం తరలింపు సొమ్ము ఎవరి జేబుల్లోకి పోతుందని పలు వురు అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లారీలు సమయానికి రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు ధాన్యాన్ని సొంత ఖర్చులతో మిల్లులకు తరలిస్తే రవాణా చార్జీలను కాంట్రాక్టర్ చెల్లిస్తాడని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని సొంత ఖర్చులు భరించి మిల్లులకు తరలించినట్లు చెబుతున్నారు. కాగా నెలలు గడుస్తున్నా ట్రాన్స్‌పో ర్టర్లు తమకు కిరాయి కట్టించడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను అడుగగా వారు ట్రాన్స్‌పోర్ట ర్లకు చెక్కుల రూపంలో మొత్తం సొమ్మును చెల్లించినట్లు వారు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టు యజ మానులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. సదరు ట్రాన్స్ పోర్టు నిర్వాహకులు రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహ నాల ద్వారా పంపించిన ధాన్యాన్ని తామే రవాణా చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసుకుని అధికారులకు తప్పుడు లెక్కలు చూపించి రూ.6.77 కోట్ల చెక్కులు పొందారని, ఇందులో సుమారు రూ.3 కోట్ల వరకు మోసం జరిగిందని అన్నదా తలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకంటున్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు వెల్లడించాలి

- వైఫల్యాలుంటే సరిదిద్దుకోవాలి
- మిల్లర్లు రైతులను ఇబ్బందుల పెడితే చర్యలు తీసుకోండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

ములుగు/భూపాలపల్లి కలెక్టరేట్ మే 27(ఆంధ్రజ్యోతి): కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సీఎం మంత్రులు, అధి కారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో కంటే ఈ సారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 64.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తైందన్నారు. ఈ సందర్భంగా అధికారులను, జిల్లా కలెక్టర్లను అభి నందిస్తున్నానని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటివరకు రూ. 12184 కోట్లు చెల్లించామన్నారు. ఎన్నడూ లేని విధంగా ధాన్యం సేకరిం చిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చేసిన మంచిని చెప్పుకోక పోవడం వల్ల చిన్న చిన్న సంఘటనలు ప్రచా రంలోకి వస్తున్నాయన్నారు. కొన్ని చోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘట నలు జరుగుతున్నాయన్నారు. అనారోగ్యంతో రైతు మరణిస్తే ధాన్యం కొనుగోలు విషయంలో మరణించాడని దుష్ప్రచారం చేశారని అన్నారు. కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉండాలని, ఏమైనా వైఫల్యాలుంటే సరిదిద్దుకో వాలన్నారు. చిన్న చిన్న సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు, దళారులు రైతు లను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయా లని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, జిల్లాల వారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. భూభారతి పేద రైతుల చుట్టమని, దీనిపై రైతులకు అవగాహన సద స్సులు నిర్వహించాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇంది రమ్మ ఇండ్లు చాలా కీలకమని, క్షేత్ర స్థాయిలో మంచిగా జరగాలంటే అది కలెక్టర్లతోనే సాధ్యమవుతుందన్నారు.

మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ వేయాలని, మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలన్నారు. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూని ట్స్ ఏర్పాటుకు రుణాలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొత్త టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాలో పర్యటిం చాలన్నారు. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక ను అందించాలని కోరారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు దివాకర, రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలి


ములుగు ఎస్పీ శబరీష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగు, మే 27(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులలో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ శబరీష్ సంబధిత అధికారలను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఈ నెలలో నమోదైన కేసు ల వివరాలను పోలీస్ స్టేషన్‌ల వారిగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తుల పురోగతిని పరిశీలించి త్వరాగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రానున్నది వర్షా కాలం అయినందున వరదలు వచ్చే ప్రమాదాలు ఉన్నా యన్నారు. వరత ముంపు ప్రదేశాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉండాలనిఅధికారులను ఆదేశించారు. గోదావరి తీర ప్రాంతాల్లోని గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. రోడ్డు ప్రమా దాలపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టలన్నారు. మహిళలపై జరిగే నేరాలలో విలైనంత త్వరగా విచారణ చేసి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ల వారిగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్, సీఐలు శంకర్, శ్రీనివాస్, కుమార్, రవీందర్, ఎస్సైలు వెంకటేశ్వ రావు, సతీష్, శ్రీకాంత్ రెడ్డి, కమలాకర్, తాజుద్దీన్, టీవీఆర్ సూరి,రాజ్‌కుమార్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేష్, జగదీష్‌లు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

భూపాలపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అడ్డుకో వడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని డీఈవో ముద్దమల్ల రాజేందర్ అన్నారు. భూపాల పల్లి, ములుగు జిల్లాల్లోని పలు కస్తూర్బా, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశా లల్లో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రతీ ఉపాధ్యా యుడి పాత్ర కీలకమని అన్నారు. దీనిని నిర్మూలించడంలో వీరిదే బాధ్యత ప్రము ఖంగా ఉండాలని అన్నారు. వీరికి సహాయకులుగా ప్రజలు కూడా ఉండాల్సిన అవ సరం ఉందన్నారు. ప్రతీ గ్రామంలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేయా లని, వారిని చైతన్యపరుస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 1098, 100, 181, 1930, సైబర్‌వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బాలికల శిశు అభివృద్ధి అధికారిణి శైలజ, క్వాలిటీ కో ఆర్డినేటర్ కాగిత లక్ష్మణ్, రిసోర్స్ పర్సన్స్ శ్రీకాంత్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

అకాల వర్షం.. అంతా అస్తవ్యస్తం..

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం..
- లోతట్టు ప్రాంతాలు జలమయం



చింతకానిలో మల్చింగ్ వేసిన కూరగాయల తోటలో భారీగా వరదనీరు, కొనుగోలు కేంద్రంలో ధాన్యం చుట్టూ చేరిన నీరు

కాటారం, మే 27(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షాలు కురిసాయి. కాటారం మండలంలో మంగ ళవారం సాయంత్రం కురిసిన అకాల భారీ వర్షంతో అంతా అస్తవ్యస్త మయింది. ఉదయం నుంచి మండే ఎండతో ఉన్న వాతావరణం ఒక్క సారిగా మారిపోయి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. అకాల వర్షంతో రైతాంగానికి నష్టం వాటిల్లింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. మండలంలోని చింతకానిలో లక్ష్మారెడ్డి అనే రైతు ఐదెకరాల్లో మల్చింగ్‌తో వేసిన కూరగాయల తోటలో భారీగా వరద నీరు చేరి భారీ నష్టం వాటిల్లింది. ఎరువుల బస్తాలు తడిసి ముద్దయ్యాయి. రేగులగూడెం, దేవరాంపల్లి, ధన్వాడ, శంకరంపల్లి, దామెర కుంట, విలాసాగర్ తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పల చుట్టూ వర్షపు నీరు చేరడంతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు వేసిన వడ్ల బస్తాలు తడవకుండా అన్నదాతలు నానా తంటాలు పడ్డారు. వడ్ల కుప్పలపై పర దాలు, టార్పాలిన్లు కప్పిన గాలులకు ఎగిరి పోయి తడిసిపోతున్నాయని, ప్రభుత్వం కొను గోలు కేంద్రాల్లో హమాలీలను అధికం చేసి కాంటాల సంఖ్యను పెంచి వడ్లు త్వరగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వానాకాలంలో కురిసినట్లు కొన్ని ప్రాంతాల్లోనే భారీ వర్షం కుర వడం గమనార్హం. మండలకేంద్రంలో భారీ వర్షానికి డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం, అసంపూర్తిగా ఉన్న వాడల్లో వరద నీరు ఇళ్ల మధ్యనే భారీగా నిలిచిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


మహాముత్తారంలో తడిసిన వరి ధాన్యం

కాళేశ్వరంలో భారీ వర్షం

మహదేవపూర్ : పుష్కరాలు ముగిసిన వేళ.. కాళేశ్వరంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకదాటిగా రెండు గంటల పాటు ఆగకుండా వర్షం కురవడంతో సరస్వతి పుష్కరాలు విజయవంతమైనందుకు వరుణుడు వర్షం కురిపించాడని పలువురు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద వచ్చింది.

కల్లాల్లో తడిసిన వరి ధాన్యం

మహాముత్తారం : మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ముడిసిపోయింది. ధాన్యం కాంటాకు వస్తుందని రైతులు అనుకోనే లోగా వర్షం పడుతుండడంతో మళ్లీ తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతు మరో మూడు రోజులు పడనుంది. దీంతో గత 15 రోజులుగా అడపదడపా పడుతున్న వర్షాలతో రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక పోతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తర లించే ఏర్పాటు చేయకపోతే ఈ సంవత్సరం చాలామంది రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముంది.

కొయ్యూర్‌లో..

మల్హర్ : మండలంలోని కొయ్యూర్‌లోని మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గ్రామంలో ఏర్పా టు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం చుట్టూ వరద నీరు చేరింది. సుమారు గంట పాటు గ్రామంలో భారీ వర్షం కురిసింది.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ


ములుగు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ములుగును మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేం దుకు అధికారులు కృషి చేయాలని, యువత, విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చూడాలని అద నపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మంది రంలో మంగళవారం జిల్లాస్థాయి నార్కో కో ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వ యంతో పనిచేస్తూ డ్రగ్స్ మూలాను పెకిలించి వేయాలని అన్నారు. కళాశాలలు, వివిధ వసతిగృహాలను సందర్శించి విద్యార్థు లకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై కూడా ఉందని పేర్కొన్నారు. అధికారులు మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ రానున్న రోజుల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ నిర్ధారణ కిట్లను తెప్పించాలని సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్, ఎస్సై సురేష్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, వివిధశాఖల ఉన్నతాధిధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొవిడ్‌పై ముందస్తు చర్యలేవి?

- ఎంజీఎం యంత్రాంగంలో కనిపించని అప్రమత్తత
- కేసుల సంఖ్య పెరిగితే సమస్యలు తప్పవు

వరంగల్ మెడికల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ మహమ్మారి మళ్లీ అలజడి రేపుతున్నట్టు వార్తలు వస్తుండగా.. ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆస్పత్రితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన నర్సంపేట, ములుగు, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి మెడికల్ కళాశాలల అనుబంధ జిల్లా జనరల్ ఆస్పత్రుల్లో ఎక్కడా కూడా ముందస్తు చర్యలు చేపట్టినట్లు లేదు. కేసులసంఖ్య సైతం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అలసత్వంగా ఉంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంటుంది. హైదరాబాద్ గాంధీ, ఆస్పత్రుల్లో ఇప్పటికే ప్రత్యేక కరోనా వార్డులను (60) పడకలతో ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎమర్జెన్సీ ఆక్సిజన్ పరికరాలతో సర్వం సిద్ధంగా ఉన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే వేగంగా కేసులు పెరిగితే సామాన్య ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ నెల 26 నాటికి కరోనా యాక్టివ్ కేసులు 1009 నమోదైనట్లు అధికారిక కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. మహారాష్ట్ర, కేరళతోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా కేసులు నమోదవుతున్నాయి. కూకట్‌పల్లికి చెందిన ఒక వైద్యుడికి పాజిటివ్ వచ్చిన సంఘటన ఆందోళన కలిగిస్తోంది. థాయిలాండ్, సింగపూర్, హాంకాంగ్‌లలో కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్న తీరు, మరణాల సంఖ్య కూడా పెరుగుతున్నాయి.

టెస్టులు చేస్తే..



మన రాష్ట్రంలో కరోనా కేసులు లేవని.. తక్కువ ఉన్నాయని.. తీవ్రత అంతగా లేదని అధికారులు చెబుతున్నారు. అలాగే కేవలం కొన్ని ప్రధాన సర్జరీ కేసులకు మాత్రమే కొవిడ్ టెస్టులు చేస్తున్నారు. అందరికీ పరీక్షలు చేస్తే కేసులు పెరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఒకటి, రెండు రోజుల వ్యవధిలోనే విదేశాల్లో వేలాదిగా కేసులు పెరిగాయి. మన దేశంలో కూడా స్వల్ప వ్యవధిలో అంకెలకు కొవిడ్ పాజిటివ్ సంఖ్య చేరింది. ఇప్పటికైనా అలసత్వం వీడి అప్రమత్తంగా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాటు చేసుకోవాలి. ముందస్తు కరోనా కిట్లు తెప్పించాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కరోనా టెస్ట్ కిట్లు ఎక్కడా లేవు. ఈ మేరకు ఆయా జిల్లాల వైద్యాధికారులను కలెక్టర్లు అప్రమత్తం చేయాలని పలువురు కోరుతున్నారు.

అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ధర్మసాగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అవినీతికి ఎలాంటి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సదానందం ఆధ్వర్యంలో ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరై చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాపాలనలో నిరుపేద వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖలలో పాలు పంచుకుంటున్నట్టు ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అనంతరం ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబంధించిన 18 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 32 మంది లబ్దిదారులకు చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అనిల్ కుమార్, వేలేరు తహసీల్దార్ కోమి, ఆర్ఐలు అనిత, స్పందన, సురేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మసాగర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ కావ్య



కేయూ సెనెట్ హాలులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్లు, తదితరులు

కేయూ తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలు

- ఆగస్టు 19, 20, 21 మూడు రోజుల పాటు నిర్వహణ
- కేయూలో బ్రోచర్ విడుదల.. ఏర్పాట్లపై వీసీ సమీక్ష

కేయూ క్యాంపస్ మే 27, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవ సంబురాల వేళ ప్రతిష్టాత్మకమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు సిద్ధం అవుతోంది. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ, లోకల్ సెక్రెటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డిలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అంతకు ముందు కేయూ కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లను సమీక్షించారు. కేయూ 50 ఏళ్ల వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకను పురస్కరించుకుని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును మూడు రోజుల పాటు కేయూ క్యాంపస్‌లో నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో రెండు ప్లీనరీలు, నాలుగు థీమటిక్ సమాంతర సెషన్లు, రెండు సబ్ థీమ్ సెషన్లు, మరో నాలుగు స్పెషల్ థీమ్ సమాంతరం సెషన్లు, 4 సమాంతరం ఓరల్ ప్రజంటేషన్‌లు, రెండు పోస్టర్ ప్రజంటేషన్లు, ప్యానల్ చర్చలుంటాయని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పుడు జరిగే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ రెండోదని పేర్కొన్నారు. గతంలో 2018లో వరంగల్ నిట్‌లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సు జరిగిందన్నారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా సుమారు వెయ్యిమంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమ, సైన్స్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ ప్రొఫెసర్ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ట్రెజరర్ ఎస్ఎంరెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి, ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ జి.హనుమంతు, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, మమత, సవితాజ్యోత్స్న, డాక్టర్ సుజాత, షయేదా, ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, డాక్టర్ మమత, డాక్టర్ చాడ రాధికారెడ్డి, ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఎస్.రామస్వామి, నిట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూకు ఉత్సవ శోభ

కేయూ క్యాంపస్ మే 27, (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు వందేళ్లు, కాకతీయ యూనివర్సిటీకి 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. కేయూ సెనెట్ హాల్‌లో మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంతో కలిసి వీసీ ప్రతాప్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వర్సిటీ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీకి గతంలో రూ.98కోట్ల నిధులివ్వగా, ఈ ఏడాది సీఎం సహకారంతో రూ.144కోట్ల నిధులను పెంచారని వెల్లడించారు. దీంతోపాటు రూ.50 కోట్ల అభివృద్ధి గ్రాంట్‌కు బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు, అకడమిక్ అభివృద్ధికి వెచ్చిస్తామని చెప్పారు. కేయూలో అకడమిక్ వాతావరణం సెమినార్లు, వర్క్‌షాపులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవగాహన సదస్సులు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలతో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందిస్తున్నట్లు వివరించారు. సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ సెల్‌గా తెచ్చామన్నారు. అలాగే 5రీసెర్చ్ సెంటర్లు, వ్యక్తిగత ప్రాజెక్టులు, 65 మంది ప్రాజెక్టు ఫెల్లోలకు పెల్లోషిప్ అవకాశం లభిస్తోందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, న్యాయశాస్త్ర కోర్సుల్లో స్కిల్స్ ఆధారిత కోర్సులను ఏఐసీటీఈ నిబంధనల మేరకు ప్రారంభిస్తామని వెల్లడించారు.

ఆగస్టు 19 నుంచి గోల్డెన్ జూబ్లీలోకి..

ఆగస్టు 19 నుంచి కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీలోకి ప్రవేశిస్తోందని, ఈ సందర్భంగా 3 రోజుల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును నిర్వహిస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. దీనికి గుర్తుగా స్వర్ణోత్సవ అకడమిక్ బిల్డింగ్‌ను, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల శతాబ్దిలోకి అడుగిడుతున్న సందర్భంగా సెంటినరీ బిల్డింగ్, అకడమిక్ బ్లాక్‌ల నిర్మాణాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు అందచేసినట్లు పేర్కొన్నారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అకడమిక్ బ్లాక్, కామన్ మెస్, ట్రైబల్ విద్యార్థులకు రెండు ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు హాస్టళ్ల కోసం అనుమతులు వచ్చాయని వెల్లడించారు. విద్యార్థులలో నైపుణ్యాల అభివృద్ధి కోసం న్యాస్కం (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) ఐటీఈఎస్‌లతోనూ అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. సామాజిక, ఆర్థిక పురోగతికి వర్సిటీలో ఏర్పాటుచేసిన పీవీ విజ్ఞానపీఠం తోడ్పడుతోందని చెప్పారు. వర్సిటీ ఆరోగ్యంకేంద్రం ఇద్దరు వైద్యాధికారులను నియమించినట్లు తెలిపారు.

జూలై 7న 23వ స్నాతకోత్సవం

జూలై 7న యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహిస్తామమని వీసీ చెప్పారు. రాష్ట్ర గవర్నర్, కేయూ చాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరుకానున్నట్లు తెలిపారు. 573 మందికి బంగారు పతకాలు, 546 మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రహరీ నిర్మిస్తాం..

యూనివర్సిటీ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని వీసీ చెప్పారు. గోడ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కమిటీల రిపోర్టులన్నీ ఉన్నాయని, అయితే తుది నివేదిక రావాల్సి ఉందన్నారు. విజిలెన్స్ మున్సిపల్, రెవెన్యూ అధికారుల సర్వే నివేదిక రూపొందించినట్లు వెల్లడించారు. తప్పుచేసిన ప్రొఫెసర్ల నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు నిబంధనల మేరకు వేటు పడుతుందని హెచ్చరించారు. పాలక మండలి అనుమతితో తుది నివేదిక తర్వాత ప్రహరీ పనులు సమర్థవంతంగా చేపడుతామని స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యలపై వాట్సాప్‌లో ఫిర్యాదులు

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై వాట్సాప్ చాట్ బాట్‌లో ఫిర్యాదు చేయొచ్చని హనుమకొండ ఎస్ఈ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ నెంబర్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నెంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే టీజీ ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వచ్చి అందులో రిజిస్టర్ కంప్లైంట్, చాట్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుందని, అందులో రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీసు నెంబర్, విత్ అవుట్ యూనిక్ సర్వీసు నెంబర్, ప్రీవియస్ మెనూ వస్తోందని, అందులో విత్ యూనిక్ సర్వీసు నెంబర్ ఎంటర్ చేయగానే వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ వివరాలు వస్తాయన్నారు. వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్‌కు సంబంధించిన వివరాలు మెనూలో కనపడుతాయన్నారు. అందులో కంప్లైంట్‌కు సంబంధించిన సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది ఏజెంట్‌తో చాట్ చేయొచ్చు లేదా కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చన్నారు. కంప్లైంట్ ఐడీతో ఒక నెంబర్ జనరేట్ అయి వినియోగదారుడి ఫిర్యాదు నమోదు చేస్తామని అనంతరం సంబంధిత అధికారికి ఫిర్యాదు నివేదించబడుతుందన్నారు.

నేడు నగరానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాక

హనుమకొండచౌరస్తా, మే 27(ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లీ బుధవారం హనుమకొండకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల 30నిమిషాలకు హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీతోపాటు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పాల్గొంటారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

గురుకుల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

హసన్‌పర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుకొని ఉద్యోగం రాని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ చొరవతో ఉన్నత ఫౌండేషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హసన్‌పర్తి సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సుధాకృష్ణ తెలిపారు. 2017 నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం పొందని వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ 79950 10593 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సుధాకృష్ణ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు
- నిందితులు మహారాష్ట్ర వాసులు..
- 9 తులాల బంగారం స్వాధీనం

మట్టెవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ నందిరాంనాయక్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వాడ్సా గ్రామానికి చెందిన వెంకటరామ గోదార్మేతో పాటు అదే రాష్ట్రం యవత్మాల్ జిల్లా ఇందిరానగర్ బోసారోడ్‌కు చెందిన షేరాలి సయ్యద్ మోతీ అలియాస్ రహీం ఇటీవలే వరంగల్‌కు వచ్చారు. రైల్వే స్టేషన్‌కు సమీపంలో గల తాళం వేసి ఉన్న ఇళ్లను ఉదయం సమయంలో రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడటంతో వీరు దిట్ట. వెంకటరామ బోళ్లు అమ్మటం ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో 2008లో దొంగతనం చేయడం ప్రారంభించి, ఇప్పటివరకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో 20కిపైగా దొంగతనాలకు పాల్పడ్డాడు. షేరాలి సయ్యద్ మోతీ అలియాస్ రహీం అక్కడి సుపారి గ్యాంగ్‌లో చేరి రెండు మర్డర్ కేసులలో తను జైలుకు వెళ్లాడు. అక్కడే గోదార్మే పరిచయం అయ్యాడు.

2022నుంచి ఇద్దరు కలిసి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో దొంగతనాలు చేయడం ప్రారంభించారు. చివరగా 2024 జూన్‌లో రాయపూర్ ప్రాంతంలో దొంగతనం చేసి అక్కడి జైలుకు వెళ్లి తిరిగి మే 1న విడుదల అయ్యారు. ప్రస్తుతం వారు బెయిల్‌పై ఉన్నందున జల్సాల కోసం మళ్లీ ఈ నెల 11న రాత్రి వరంగల్ బ్యాంక్ కాలనీ-2, శాంతినగర్ ఏరియాలోని తాళం వేసి ఉన్న బయ్య స్వామి ఇంట్లో చొరబడి తొమ్మిది తులాల బంగారంతో పాటు రూ.1000 నగదు దొంగిలించారు. పక్కా సమాచరాంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఏసీపీ తెలిపారు. కాగా, దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి, ఎస్ఐ నవీన్‌కుమార్, క్రైమ్ టీం కానిస్టేబుళ్లు హరికాంత్, మీర్ మహ్మద్ అలీ, రాజేష్, ఏఏవో మహ్మద్ సల్మాన్ పాషా, నాగేశ్‌రెడ్డి, ప్రవీణ్‌ను ఏసీపీ అభినందించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో భారీ మోసం

రూ.3.70 కోట్ల వసూళ్లు.. నిందితులు అరెస్టు, రిమాండ్ : ఏసీపీ పి. ప్రశాంత్‌రెడ్డి

కాజీపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర నిందితులు భారీ మోసానికి పాల్పడ్డారు. ఆన్‌లైన్‌లో నగదు పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇప్పిస్తామని నమ్మబలికి కాజీపేటలో పెట్టుబడిదారుల నుంచి రూ. 3.70 కోట్లువసూలు చేశారు. తీరా చూస్తే వడ్డీ రాకపోగా, నగదు కూడా చెల్లించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

మహారాష్ట్ర పూణెకు చెందిన మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీ వీఏపీ గ్రూప్ ఆఫ్ కంపెనీ పేరుపై 2022లో కాజీపేట ఎస్ఎస్ఎస్ కాంప్లెక్స్‌లో కాంపెనీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కాజీపేటకు చెందిన కంపెనీ బ్రాంచ్ మేనేజర్ మందల కనుకరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన క్లబ్ ప్రెసిడెంట్ మేరుగు దీక్షిత్‌లు గ్లోబల్ అఫిలియేట్ బిజినెస్‌లో ఆన్‌లైన్‌లో నగదు పెట్టుబడి పెడితే రూ.లక్షకు 3 శాతం వడ్డీ ఇప్పిస్తామని నమ్మబలికి పెట్టుబడిదారుల నుంచి కాజీపేటలో 70 మంది వద్ద రూ.3.70 కోట్లు పెట్టుబడి పెట్టించారు. అవసరమైతే పెట్టుబడి పెట్టిన నగదు సైతం తిరిగి ఇస్తామని నమ్మబలికారు. కొంతకాలం పెట్టుబడి దారులకు నమ్మకం కలిగించేలా వడ్డీ చెల్లించారు. తరువాత క్రమంలో వడ్డీ చెల్లించక పోవడంతో బాధితుల్లో ఒకరైన కాజీపేటకు చెందిన ఆరూరి రాజయ్య అనే వ్యక్తి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో నమ్మలేని నిజాలు వెలుగు చూశాయని ఏసీపీ చెప్పారు. పూణెలో ఈ కంపెనీ స్థాపించిన వినోద్ కుట్టే ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర కంపెనీ డైరెక్టర్‌లుగా బాలకృష్ణ, కెఎల్ఎన్‌రావు, గుమ్ముల సత్యనారాయణ, కళ్యాణ్ చక్రవర్తి, సంతోష్ పురణితోపాటు దేశవ్యాప్తంగా ఏజెంట్‌లను నియమించుకుని అమాయకులను నమ్మించి దేశవ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. కంపెనీకి తెలంగాణలో నల్లగొండ, భద్రాచలం, కొత్తగూడెం, హనుమకొండ, ఇల్లందులో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా బాధితులు ఫిర్యాదు మేరకు హెడ్‌ఆఫీస్‌పై ఎన్‌ఫోర్స్ మెంట్ రైడ్‌చేసి వినోద్‌కుట్టే, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వినోద్‌కుట్టే దుబాయ్‌కి పారిపోయి తలదాచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అధిక వడ్డీతో ఎవరైనా మోసం చేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు ఎక్కువ వడ్డీ ఆశతో మోసపోవద్దని ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఈ కేసు చాకచక్యగా ఛేదించిన కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డిని, ఎస్సై వి.నవీన్‌కుమార్, ఎస్.సర్వేశ్వర్, సిబ్బంది కె. శ్రీనివాస్, సీహెచ్ శ్రీధర్, బి.భాస్కర్, జి.సునీల్ కుమార్, ఎం.వినయ్ కుమార్‌లను ఏసీపీ అభినందించారు.

వర్సిటీలో అవినీతి, అక్రమాలపై కొరడా

- రంగంలోని దిగిన వీసీ, రిజిస్ట్రార్‌లు
- అవినీతి, అక్రమాలపై ఇప్పటికే విచారణ కమిటీ ఏర్పాటు
- ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ వ్యవహారశైలిపై గుస్సా

కేయూ క్యాంపస్ మే 26, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీ కళాశాలలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు స్వయంగా పరిశీలనలు చేపట్టారు. కళాశాలతో పాటు వర్సిటీలోని అన్ని విభాగాలలో అవినీతి, అక్రమాలు, అవకతవకలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కేయూ క్యాంపస్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం స్కాలర్లు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు స్వయంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని పరిశీలించారు. ఆ విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలపై కన్నేశారు. విద్యార్థులకు డ్రెస్‌లు ఇప్పిస్తామని కళాశాలకు సంబంధం లేని బయట వ్యక్తులు వచ్చి డబ్బులు వసూళ్లకు పాల్పడటంతో పాటు తరగతుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం తదితర అంశాలపై వివరాలను సేకరించారు. దీనిపై కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కెమిస్ట్రీ ప్రొఫెసర్లు టి.సవితా జ్యోత్స్న, ఎస్.జ్యోతిల నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ వీలైనంత త్వరగా విచారణ చేపట్టి నివేదికను అందచేయాలని రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఇటీవల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రాథమిక విచారణ చేపట్టింది. వివరాలను సేకరించింది. అవకతవకలపై పత్రాలను సేకరిస్తోంది. అలాగే ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధ్యాపకులను విచారించింది. ఇదిలా ఉండగా, వర్సిటీ బీఈడీ కళాశాల వ్యవహారాలపై కూపీ లాగుతున్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు.

కాంట్రాక్టు ప్రిన్సిపాల్‌పై గుస్సా..

కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంట్రాక్టు ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై కేయూ ఉన్నతాధికారులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. బయటి వ్యక్తి కళాశాల విద్యార్థుల వద్దకు వచ్చి డ్రెస్‌లు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్ల చేయడాన్ని వర్సిటీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. డ్రెస్‌ల కోసమంటూ ప్రైవేట్ వ్యక్తి విద్యార్థుల నుంచి ఫోన్ పే, గూగుల్ పేలతో వసూళ్ళకు పాల్పడినట్లు పక్కా ఆధారాలను సైతం సేకరించారు.

సస్పెండైన ఏఆర్ విషయంలోనూ..

గతంలో వివిధ ఆరోపణలతో సస్పెండైన అధికారితో పాటు, డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ అధికారులపై కూడా వర్సిటీ అధికారులు కఠినంగానే వ్యవరిస్తున్నారు. వీళ్ల మళ్లీ ఉద్యోగంలోకి వచ్చేందుకు అనేక రాజకీయ ఒత్తిళ్లకు దిగుతున్నప్పటికీ నిబంధనల ప్రకారంమే నడుచుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ప్రైవేట్ కళాశాల పర్మిషన్ల కోసం గతంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్సిటీ అధికారుల తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది.



కేయూ స్పోర్ట్స్ బోర్డులో పర్యటిస్తున్న వీసీ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం (ఫైల్)

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రొఫెసర్ల కమిటీ విచారణ

విద్యార్థులతో ముఖాముఖి.. తమకు క్లాస్‌లు జరగడం లేదని విద్యార్థుల ఏకరువు

కేయూ క్యాంపస్ మే 27, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మంగళవారం సాయంత్రం ముగ్గురు ప్రొఫెసర్ల కమిటీ రెండో దఫా విచారణ చేపట్టింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అవకతవకలు, అవినీతి, అక్రమ వసూళ్లు, అస్తవ్యస్థంగా మారిన కళాశాల దుస్థితిపై స్కాలర్లు ఫిర్యాదు చేయడంతో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు ప్రొఫెసర్ల విచారణ కమిటీని నియమించారు. విచారణ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్లు, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, ప్రొఫెసర్ ఎస్.జ్యోతిలతో కూడిన విచారణ కమిటీని నియమించారు. కమిటీ బాధ్యులు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో బీపీఈడీ, ఎంపీఈడీ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. తమకు తరగతులు సక్రమంగా జరగడం లేదని, ఫిజికల్ ఈవెంట్లు నిర్వహించడంలేదని ప్రొఫెసర్ల కమిటీ ఎదుట తమ బాధాలన్ని ఏకరువు పెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కటి రెండు క్లాస్‌లు అప్పుడప్పుడూ జరు గుతాయని, అయితే సిలబస్ పూర్తి కావడం లేదని విన్నవించారు. గ్రౌండ్‌లో ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహిం చడం లేదని పేర్కొన్నారు. కొందరు అధ్యాపకులు తరగతులు చెప్పేందుకు వచ్చి హాజరుతీసుకుని వెళతారని తమ ఆవేదన వెళ్లగక్కారు. కమిటీ బాధ్యులు విద్యార్థులు చెప్పిన విషయాలన్ని నోట్ చేసుకుని వెళ్లారు. కమిటీ బాధ్యులు మరికొందరిని సంప్రదించి విచారణకు సంబంధించిన కీలక అంశాలను సేకరిస్తారని తెలుస్తోంది.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

భూసేకరణను వేగంగా పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే కోసం చేస్తున్న భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, పరకాల నియోజకవర్గ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ ప్రక్రియ గురించి పరకాల ఆర్డీఓ నారాయణ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భూసేకరణ మొదటి దశలో గుర్తించిన రైతులకు జూన్ 30 నాటికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల్లో రైల్వే శాఖకు అందించాల్సిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. భూసేకరణ అయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ఈ సమీక్షలో గౌరవెల్లి ప్రాజెక్టు డీఈ చైతన్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ రికార్డుల తయారీలో

సర్వేయర్ల పాత్ర కీలకం

వరంగల్ కలెక్టర్ సత్యశారద



అభ్యర్థులకు మెటీరియల్ కిట్‌లను అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

పోచమ్మమైదాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన రికార్డుల తయారీలో సర్వేయర్ల పాత్ర కీలకమైందని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో మంగళవారం లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు మెటీరియల్ కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, పర్యవేక్షకుడు అబుతల్హా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాల్లో

సింగరేణి సేవలపై హర్షం

➡ రూ.90 లక్షలు వెచ్చించిన యాజమాన్యం



పుష్కరాల్లో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సింగరేణి సిబ్బంది

భూపాలపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం విశేష సేవలు అందించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సింగరేణి గనులు ఉండడమే కాకుండా, ఇదే జిల్లాలో సరస్వతి పుష్కరాలు జరగడంతో తమ సేవలను పూర్తిస్థాయిలో అందించడం విశేషం. సుమారు రూ.90 లక్షలు వెచ్చించినట్లు ప్రకటించింది. నదిలో ప్రాణనష్టం జరగకుండా కాపాడే రెస్క్యూ టీమ్ నుంచి మొదలుకుని ఆస్పత్రి సేవల వరకు అందించింది. అంతేకాదు.. రోజుకు సుమారు 8వేల మందికి మజ్జిగ ప్యాకెట్లను అందించడం, 200 కూల్ వాటర్ వ్యాన్‌ల ద్వారా తాగునీటిని అందించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులను బస్టాండ్ నుంచి సరస్వతి పుష్కరఘాట్ వరకు ఉచితంగా తీసుకెళ్లేందుకు 12 స్కూల్ బస్సులు, 5 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సింగరేణి నుంచి ఇద్దరు ప్రత్యేక వైద్యులను నియమించడమే కాకుండా ముగ్గురు అసిస్టెంట్లను కూడా ఏర్పాటు చేసింది. నదీ తీరం వద్ద 40 మంది రెస్క్యూ టీమ్, 35 మంది స్విమ్మర్లు 24 గంటలు పనిచేశారు. వీరందరినీ సమన్వయం చేయడానికి ఒక పర్సనల్ అధికారి, ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించినట్లు జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అలాగే పారిశుధ్య పనుల కోసం 10 మంది క్యాజువల్ లేబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కమలాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద అన్నదానం కార్యక్రమంలో తమ సిబ్బంది పాల్గొని వంటలు చేశారని తెలిపారు.

ఆడదాం పాడదాం

సమ్మర్ క్యాంపులకు చలో.. చలో..

- సర్కార్ బడుల్లో వేసవి శిక్షణ శిబిరాలు
- క్రీడలు, కళలు, ఇతర రంగాల్లో శిక్షణ
- పలు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు









హనుమకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులను వారి తల్లిదండ్రులు వేసవి శిక్షణ శిబిరాలకు పంపుతున్నారు. ప్రస్తుతం చాలామంది పిల్లలు సమ్మర్ క్యాంపుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు తదితర సృజనాత్మక కళల్లో శిక్షణ పొందుతున్నారు. బడులు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు వేసవి శిక్షణకు తల్లిదండ్రులు పంపుతున్నారు. ప్రస్తుతం చిన్నారులతో శిబిరాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విజ్ఞాన వేదికలు పిల్లల కోసం వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఆటల్లో ఆసక్తి ఉన్నవారికి జిల్లా యువజన, క్రీడల ప్రాధికార సంస్థ కూడా శిక్షణశిబిరాలను నిర్వహిస్తోంది. ఈ శిబిరాలకు పిల్లలు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. శిక్షణ తరగతులకు పిల్లలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా హాజరవుతున్నారు.

క్రీడల్లో..

జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయి. మొత్తం 26 క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, హ్యాండ్‌బాల్, ఖో-ఖో, కబడ్డీ, రెజ్లింగ్, వాలీబాల్, లాన్‌టెన్నిస్, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్, నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. అర్బన్ పరిధిలో బీమారం జడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ, వాలీబాల్, హసన్‌పర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో బాక్సింగ్, గోపాల్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో కరాటే, హనుమకొండ సెయింట్ పీటర్ హైస్కూల్‌లో కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, నయీంనగర్‌లోని హాకీ క్లబ్‌లో హాకీఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి భీమదేవరపల్లి (కిక్‌బాక్సింగ్), పంథిని (హాకీ), ఒంటిమామిడిపల్లి (సాఫ్ట్‌బాల్), ధర్మసాగర్ (బాక్సింగ్), గట్లనర్సింగాపూర్(కబడ్డీ), పంథిని(వాలీబాల్), భీమదేవరపల్లి (కబడ్డీ), పరకాల, (కబడ్డీ), వేలేరు(కబడ్డీ), పరకాల (తైక్వాండో)లో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

బాలగోకులం

బాల, బాలికలల్లో నైతిక విలువలను పెంపొందించడానికి బాలగోకులం పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ వరంగల్ విభాగ్ వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తోంది. మాధవ స్మారక సమితి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ కాకాజీ కాలనీలోని వివేకానంద యోగా కేంద్రంలో ఈనెల 1న ఈ శిబిరంలో ప్రారంభమైంది. క్రమశిక్షణ, దైవభక్తి, పెద్దల పట్ల గౌరవం, మానవీయ విలువలతో పాటు స్వదేశీ ఆటలు, యోగాసనాలు, సంస్కృతం, పద్యం నేర్చుకోవడం లాంటి విషయాలతో పాటు అందమైన చేతిరాత రాయడం, చిత్రలేఖనం తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు.

పేరిణి శిక్షణ శిబిరం

హనుమకొండలోని నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో 6 నుంచి 40 ఏళ్ల వయసుగల వారి వరకు తెలంగాణ శాస్త్రీయ సంప్రదాయ పేరిణిలో శిక్షణ ఇవ్వడానికి ప్రముఖ నృత్య కళాకారుడు గజ్జెల రంజిత్ కుమార్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గత నెల 24 నుంచి ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 6 వరకు కొనసాగుతుంది. దేశాయిపేట రెండో బ్యాంక్ కాలనీలోని పేరిణి నృత్యాలయం, కొత్తవాడలోని విశ్వభారతి హైస్కూల్, దేశాయిపేట రోడ్‌లోని నాగార్జున స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇదే ప్రాంతంలోని నాగార్జున ఇంటర్నేషనల్ స్కూల్, విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాలలో ఈ శిక్షణశిబిరాలను నిర్వహిస్తున్నారు.

విజయవంతంగా సమ్మర్ క్యాంపులు

ఈనెల 1వ తేదీ నుంచి వరంగల్ జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలలు, హనుమకొండ జిల్లాలో 14 బడులను వరంగల్ జిల్లాలో ఈనెల 5వ తేదీ నుంచి ఈ క్యాంపులు విజయవంతంగా నిర్వహించారు. ఈ క్యాంపులు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లిష్, క్రీడలు, చిత్రలేఖనం, పెయింటింగ్, వ్యాయామ విద్య, యోగా, కంప్యూటర్ విద్య, ఆర్ట్, క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. క్యాంపుల్లో పాల్గొనే విద్యార్థులకు అల్పాహారం అందించింది. కాగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రజ్ఞ పేరుతో వేసవి శిక్షణ తరగతులను గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించింది. ఈ శిబిరం కొనసాగింది. ప్రముఖ చిత్రకారిణి సాగంటి మంజుల ఆధ్వర్యంలో చిత్రలేఖనంలో వేసవి శిక్షణ శిబిరం ఈనెల 1 నుంచి ప్రారంభమైంది. 21 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగింది. హనుమకొండ పబ్లిక్ స్కూల్, సబేదారిలోని సత్యం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు.

ఎక్కడి చెత్త అక్కడే

సుమారు 20 లక్షల మంది భక్తుల రాకతో పేరుకుపోయిన వ్యర్థాలు



గోదావరి నదిలో కుప్పలుగా ఉన్న చెత్త



మహదేవపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో పుష్కరాలు విజయవంతంగా ముగిశాయి. ఈ క్రమంలో ఎంతమంది భక్తులు తరలివచ్చారో ఆ మేరకు కాళేశ్వరం గ్రామం, గుడి, నదీ తీరానా భారీ ఎత్తున చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. అధికార యంత్రాంగం ఆంధ్రా నుంచి సుమారు 400 మంది వర్కర్లను తీసుకొచ్చి పనిచేయించినా ఊహించని కంటే ఎక్కువ మంది భక్తులు తరలిరావడం.. పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది.



ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త

నది తీరం.. దుర్గంధం

గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పెద్ద సంఖ్యలో సరస్వతి మాతకు చీర, సారె, టెంకాయలు, దీపాలు వదిలారు. అంతేగాకుండా పెద్ద ఎత్తున పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేశారు. దీని వల్ల నది శివారుతో పాటు నదిలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. సుమారు 20 లక్షల మంది భక్తులు స్నానాలు చేయడం, ఇతర కార్యక్రమాలు చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి త్వరితగతిన చెత్తను తొలగించాలని కాళేశ్వరం గ్రామస్థులు కోరుతున్నారు.

నిన్న కళకళ.. నేడు వెలవెల

మహదేవపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఒక్కరోజు క్రితం విపరీతమైన భక్తుల రద్దీ.. తెల్లవారేసరికి నిర్మానుష్యంగా మారింది. కేవలం ఒక్క రోజు తేడాతోనే గోదావరి తీర ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా మారింది. 12 రోజుల పాటు అతిథులుగా వచ్చి .. సందడి చేసి భక్తులు ఎవరి గమ్యస్థానాలకు వారు వెళ్లిపోయారు. చివరకు మంగళవారం కాళేశ్వరం గ్రామస్థులే మిగిలారు. ఈ దేవాలయం కూడా భక్తులు లేక చిన్నబోయింది. కాలు తీసి కాలు పెట్టలేని రద్దీతో కిటకిటలాడిన కాళేశ్వరం నిర్మానుష్యంగా మారింది. నెలల కొద్దీ ప్లానింగ్ చేసి పనులు చేపట్టి.. ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు సైతం సరస్వతి పుష్కరాలు విజయవంతం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న కాళేశ్వరం గ్రామం

త్వరలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్

» నెరవేరుతున్న కల » ఎంపీ కావ్యకు ఉద్యోగుల కృతజ్ఞతలు

హనుమకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్ త్వరలో ప్రారంభం కానున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరబోతున్నది. వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు తెలియచేసింది. ఈ మేరకు లేఖ రాసింది. వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కావ్య కేంద్ర ఆరోగ్య శాఖకు పలుసార్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆరోగ్య మంత్రిత్వశాఖ సానుకూలంగా స్పందించింది. వరంగల్‌తో సహా దేశవ్యాప్తంగా 22 కొత్త సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. వెల్‌నెస్ సెంటర్ల అవసరమైన మెడికల్ ఆఫీసర్లు, ఇతర పారామెడికల్ సిబ్బంది నియామకానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) నుంచి ఆమోదం లభించినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రోలీసింగ్ డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ (డీఓఈ)కు పంపగా కొన్ని సవరణలు కోరుతూ ఫైల్ పంపారని ఆ లేఖలో తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ స్పష్టీకరణలపై పని చేస్తోందని తెలిపారు. కాగా, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సెర్ప్‌లో ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం

ఉద్యోగుల ఐచ్ఛికాలను అడిగిన ప్రభుత్వం

హనుమకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్)లో ఎట్టకేలకు బదిలీలకు రంగం సిద్ధమైంది. మొదట ఎల్-4 (జిల్లా ప్రాజెక్టు మేనేజర్), ఎల్-5 (అడిషనల్ డీఆర్‌డీవో)ల బదిలీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎవరు ఎక్కడికి బదిలీలు కోరుతున్నారో తెలియచేసేందుకు ఐచ్ఛికాలను కోరింది. ఈ మేరకు సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశా రు. ఉద్యోగులు ఐచ్ఛికాలను తెలియచేసేందుకు ప్రత్యేకంగా ఒక ఫార్మాట్‌ను రూపొందించారు. ఈ ఫార్మాట్‌లో ఎల్-4, ఎల్-5 ఉద్యోగులు తాము ఎక్కడికి బదిలీ కావాలని కోరుకుంటున్నారో వరుస క్రమంలో 5 ఐచ్ఛికాలను పేర్కొనాలని, అందులో ఆదేశించారు. ఈ ఫార్మాట్‌ను ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 29 మధ్యాహ్నం 1 గంటలోగా ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాలి. అలాగే సంతకం చేసిన ఒక ప్రతిని సంబంధిత డీఆర్‌డీవోకు లేదా డైరెక్టర్లకు అందచేయాలి. డీఆర్‌డీవోలు, డీఆర్‌డీఎలు, ఎస్‌ఎంఎంయూలోని డైరెక్టర్లు ఈ ఫారమ్‌లను ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకల్లా ప్రత్యేక మెసెంజర్ల ద్వారా సెర్ప్ చీఫ్ ఎగ్జిగ్యూటివ్ కార్యాలయానికి పంపించాలి.

పదేళ్ల తర్వాత..

సెర్ప్‌లో పదేండ్ల తర్వాత బదిలీలు జరుగుతున్నాయి. ఎల్-4, ఎల్-5 ఉద్యోగుల బదిలీలు పూర్తయిన తర్వాత ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్), సీసీల (క్లస్టర్ కోఆర్డినేటర్లు) బదిలీలు జరుగుతాయి. అడిషనల్ డీఆర్‌డీవోలు జిల్లాకు ఒక్కరే ఉండగా, డీపీఎంలు జిల్లాకు నలుగురు చొప్పున ఉంటారు. వీరిలో ఒకరు మహిళా సంఘాలను, ఇంకొకరు మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ, మిగతా ఇద్దరు ఫార్మ్ యాక్టివిటీ, నాన్ ఫార్మ్ యాక్టివిటీ వ్యవహారాలను చూడడానికి ఉంటారు. ప్రస్తుతం వీరి బదిలీలే జరుగుతాయి. తర్వాత ఏపీఎంలు (అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు), క్లస్టర్ కోఆర్డినేటర్ల బదిలీలను చేపడతారు. ఏపీఎంలు మండలానికి ఒకరు ఉండగా, క్లస్టర్ కోఆర్డినేటర్లు ఒక్కో జిల్లాలో క్లస్టర్లను బట్టి 45 నుంచి 65 వరకు ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా 3974 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. చాలా కాలంగా తమను బదిలీ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. వారి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇందిరా మహిళా శక్తి పాలసీ, మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కల్పన, సంపద సృష్టి దిశగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన సెర్ప్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నది. మహిళా సమాఖ్యలను మరింత బలోపేతంచేసే కార్యక్రమం బదిలీల తర్వాత వేగవంతమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించి 40శాతానికి మించి ఉద్యోగులను బదిలీలు చేయొద్దనే నిబంధన నుంచి సెర్ప్ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి సర్వీస్‌తో సంబంధం లేకుండా అన్ని స్థాయిలో ఉద్యోగులందరినీ పూర్తిస్థాయిలో బదిలీ చేయనున్నారు.

ముందుకు సాగని సాదాబైనామా

» కాలపరిమితి చెప్పకపోవడంతో హైరానా
» పైలట్ ప్రాజెక్టులో సమస్యల పరిష్కారంపై అనుమానాలు
» చిన్న రెవెన్యూ గ్రామాలపైనే అధికారుల ఫోకస్
» సవరణలు, వారసత్వ దరఖాస్తులకే మోక్షం

వర్ధన్నపేట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్.. సాదాబైనామాల సమస్యను మరింత జఠిలం చేసిందనే ఆరోపణలున్నాయి. ధరణికి ముందు సాదాబైనామా దరఖాస్తులను తీసుకున్నప్పటికీ, వాటిలో చాలావరకు తిరస్కరణకు గురయ్యాయి. అనేక మంది రైతులు తమ సాదాబైనామాలను ధరణిలో నమోదు చేసుకోలేకపోయారు. దీంతో వారు తమ భూములపై హక్కులు కోల్పోయి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ధరణిలో భూ రికార్డుల లోపాలు, సర్వే నంబర్ల తప్పులు, విస్తీర్ణం తేడాలు వంటి సమస్యలతో పాటు సాదాబైనామాల సమస్య మరింత తీవ్రమైంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించకపోవడం వలన, ఇప్పుడు మళ్లీ జాప్యం జరుగుతుందేమోనని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు.

పైలట్ ప్రాజెక్టు ఉత్తదేనా?

భూ భారతి 2025 చట్టం కింద సమస్యల పరిష్కానికి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు మే 5 నుంచి 14వ తేదీ వరకు రైతుల వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇలా మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలతో 2,917 దరఖాస్తులు రెవెన్యూ సదస్సుల ద్వారా అందుకున్నారు. మండలవ్యాప్తంగా 1,415 సాదాబైనామా దరఖాస్తులే రెవెన్యూ అధికారుల దృష్టికిరాగా, ఇప్పటి వరకు వాటిలో ఒక్క దరఖాస్తు కూడా పరిశీలనకు ముందుకు సాగడంలేదు. దరఖాస్తుదారులకు కాలపరిమితిని సైతం ప్రభుత్వం పెట్టకపోవడంతో అధికారుల్లో సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సాదాబైనామాపై రైతులు పెట్టుకున్న ఆశలు నిరాశగానే మిగిలిపోయే అవకాశం ప్రస్తుతం కనిపిస్తోంది. జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం ద్వారా సమస్యల పరిష్కారం అమలులోకి రానుండగా, పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండలాల్లో ఇలా పరిస్థితులు ఉండడంతో ఈ ప్రాజెక్టు ఉత్తదేనా? అంటూ పలువురు ఆరోపణలు చేస్తున్నారు.



కాలపరిమితి పెట్టని ప్రభుత్వం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు ఓ నిర్ణీత గడువును ప్రకటించి, వారి నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో చాలా శాతం వరకు పట్టాదారు పాసు పుస్తకాలను రైతులు పొందారనేది రెవెన్యూ అధికారుల భావన. ప్రస్తుతం భూ భారతి చట్టం ద్వారా సైతం సాదాబైనామా దరఖాస్తులతో భూమిని రెవెన్యూ రికార్డుల్లో ఎక్కిస్తామని దరఖాస్తులు స్వీకరించారు. కానీ, ఇప్పటి ప్రభుత్వం ఓ కటాఫ్ డేట్‌ను ప్రకటించలేదు. దీంతో రెవెన్యూ అధికారులకు ఇదో పెద్ద సవాల్‌గా మారింది. పట్టాదారు పాసు పుస్తకం గతంలోనే ఉండి, మళ్లీ తిరిగి సాదాబైనామా పేపర్‌పై కూడా వ్యవసాయ భూమిని కొనుగోలు చేసిన రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కొంత మంది కొత్త వ్యక్తులు పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నిర్ణీత గడువు ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు. దీంతో అధికారులు వాటిపట్ల పెద్దగా శ్రద్ధపెట్టడం లేదని తెలుస్తోంది.



వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

వర్ధన్నపేట మండంలోని గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 2,917 దరఖాస్తులు రైతుల నుంచి రెవెన్యూ అధికారులకు వచ్చాయి. వీటిలో ఎక్కువగా సాదాబైనామా కింద 1,415 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తర్వాత అసైన్డ్ భూములకు సంబంధించి 746 రాగా, వారసత్వం భూ మార్పిడి సమస్యలంటూ 192, భూ విస్తీర్ణంలో తేడాలు సరిచేయడానికి 155 దరఖాస్తులు మండల వ్యాప్తంగా వచ్చాయి. అత్యల్పంగా నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఒకటి, 38-ఈ ధ్రువపత్రం కోసం ఒకటి, పట్టాదారు పేరు, తండ్రి లేదా భర్త పేరు సరిచేయడానికి

దరఖాస్తులు 2,917.. పరిష్కారం దిశగా 700

నాలుగు, భూసేకరణకు సంబంధించినవి ఐదు దరఖాస్తులు వచ్చాయి. ఇక మిగిలినవి 20కి పైగా వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో ఇప్పటి వరకు సాదాబైనామాల ఊసే కనిపించడం లేదు. విస్తీర్ణంలో తేడాలను సర్వే పేరిట వాయిదా వేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో సమస్యలు ఉంటే పెండింగ్‌లోనే పెడుతూ, కోర్టు కేసులు, తగాదాలు ఉంటే వాటి జోలికే పోవడం లేదు. పెద్ద రెవెన్యూ గ్రామల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో జఠిలమైన సమస్యలే ఉండడంతో వాటిని పక్కన పెట్టినట్లుగా సమాచారం. ఇలా 700 వరకు దరఖాస్తులను పరిష్కారం దిశగా కసరత్తు చేస్తున్నప్పటికీ, అందులో కూడా 135 వరకే మోక్షం కలిగే అవకాశం ఉన్నట్లుగా రెవెన్యూ అధికారులు చెప్పకనే చెపుతున్నారు.



ఆయిల్ పామ్ సాగును పెంచాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంపత్‌రావు

ఏటూరునాగారం, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిన్ ఫామ్ పంటల సాగును మరింత పెంచాలని ములుగు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి డి. సంజీవరావు రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎక్కెల గ్రామంలోని ఆయిల్ పామ్, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో ప్రస్తుతం 27వేల ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉందని, అందులో 26వేల 58 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోందని సంజీవరావు తెలిపారు. ఆయిల్ పాం సాగును ప్రోత్సహించడానికి ఎకరానికి 57 మొక్కలను 90శాతం రాయితీపై రైతులకు అంది స్తున్నట్లు తెలిపారు. ఒక మొక్కకు రూ. 20 చొప్పున, రైతులు మొత్తం రూ. 1140 చెల్లిస్తే 57 మొక్కలను సరఫరా చేస్తారని, మొక్కలపై రూ. 11,600 రాయితీ కింద ఎకరానికి రూ. 4200 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు అందిస్తామన్నారు. రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.



ఎక్కెలలో ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంపత్‌రావు

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు..

ఆయిల్ పామ్ సాగు చేసి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీపై, సన్నకారు, చిన్నకారు, బీసీ రైతులకు 90శాతం రాయితీపై, ఇతర రైతులకు 80శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందిస్తామని తెలిపారు. పంటల సాగుకు సంబంధించిన రైతులకు సూచనలు, సలహాలను అందించడానికి జిల్లాలో ఇద్దరు ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తీర్ణ అధికారి, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ కంపెనీ సిబ్బంది అన్ని మండలాలలోని రైతులకు అందుబా టులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

● ఏటూరునాగారం రూరల్ : ఉద్యానవన పంటల సాగు రైతులకు లాభదాయకమని, ఆ పంటలను సాగుచేసేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి సంజీవరావు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో పామాయిల్, అరటిపండ్ల సాగును పరిశీలించారు. అయిల్‌పామ్ సాగును ప్రోత్సహించ డానికి ఎకరాకు 57మొక్కలు సరఫరా చేయడం జరుగుతుందని, రైతులు పథకాలను వినియోగించుకోవాలన్నారు.

అందరి సహకారంతోనే పుష్కరాలు విజయవంతం

భూపాలపల్లి కలెక్టరేట్, మే 27: సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు భాగస్వాములైన అధికారులు, సిబ్బంది, మీడియా, భక్తులకు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో కలెక్టర్ విధి నిర్వహణలో నిబద్ధత, సమగ్ర ప్రణాళిక, అవిశ్రాంతి కృషి వల్ల లక్షలాది మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా జిల్లా పరిపాలన సామర్థ్యాన్ని, ఐక్యతను నిరూపించుకున్నామన్నారు. పుష్కరాల సమాచారాన్ని ప్రజలకు చేరవే సిన మీడియాకు ప్రత్యేకంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో సేవా దృక్పదాన్ని కొనసాగిస్తూ మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమన్వ యంతో కలిసి పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

అధికారులందరికి కృతజ్ఞతలు : ఈవో

మహదేవపూర్, మే 27(ఆంధ్రజ్యోతి) : పన్నెండు రోజులపాటు జరిగిన సరస్వతి పుష్కరాలకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులందరికి కాళేశ్వర ముక్తీశ్వర స్వామీ దేవస్థానం ఈవో మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లడుతూ అన్ని శాఖలను సమన్వయం చేస్తూ పుష్కరాలను దిగ్విజయం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్, పంచాయతీ, వైద్య, విద్యుత్ శాఖల జిల్లా, మండల అధికారులు, సిబ్బందితో పాటు ఇరిగేషన్, రూరల్ వాటర్ సప్లయ్, ఆర్టీసీ, సింగరేణి, స్కౌట్స్ అండ్ గైడ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆలయ అర్చకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

ములుగుటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ములుగు పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ సభ్యులు మురుకుట్ల నరేందర్, నేపాల్‌రావు, సందీప్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వాలి

ఏటూరునాగారం, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి అందించాలని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) డివిజనల్ మేనేజర్(డీఎం) కుంజా వాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, సేల్స్‌మెన్‌లు, డీలర్లతో ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో వెంకటాపురం జీపీసీఎంఎస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, జీసీసీ కార్యాలయ సిబ్బంది ఎమ్డీ. అన్వర్ పాషా, టి. వినాయక్, రేషన్ దుకాణాల సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో పోడు భూముల సమస్యలకు పరిష్కారం

ఏటూరునాగారం, మే 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క సహకారంతోనే మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం అటవీశాఖ అధికారుల చొరవతో, రైతులు తమ భుములలో పండ్ల మొక్కల సాగుకు అంగీకారం తెలిపారని రఘు అన్నారు. మొత్తం 150 ఎకరాల్లో 63 మంది రైతుల ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టారన్నారు. అంతేకాకుండా చిన్నబోయినపల్లిలో గ్రామ పంచాయతీ పరిధిలో 56లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు చేల వినయ్, లాల్‌మహ్మద్, కుంభం రాజేష్ పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపు ఉపయోగకరం

కృష్ణకాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో శిక్షణ పొందిన విద్యార్థులతో సమావేశమై వారికి స్పోర్ట్స్ యూనిఫామ్‌ను అందించారు. ఏటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ మధుకర్‌రెడ్డి, కేరళ గౌరవ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకటాపురం తహసీల్దార్‌గా వేణుగోపాల్

వెంకటాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం మండల తహసీల్దార్‌గా మేడా వేణుగోపాల్ మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన లక్ష్మీరాజయ్య భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కన్నాయిగూడెం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను మండల తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

నాణ్యమైన పత్తి విత్తనాలనే అమ్మాలి

మహాముత్తారం, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ఫర్టిలైజర్ షాపుల యాజమానులు రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలనే అమ్మాలని మహదేవపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీపాల్ అన్నారు. మంగళవారం ఆయన బోర్లగూడెం రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపు డీలర్స్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విడి పత్తి విత్తనాలను, హట్ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకొంటామని అన్నారు. వ్యవసా యాధికారి జి. అనుషా, ఏఈవోలు శివకృష్ణ, ప్రవళిక, శశివర్ధన్‌లు పాల్గొన్నారు.

12 రోజుల పాటు యోగాపై అవగాహన

మంగపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా ఫర్ వన్ హెర్త్ వన్ హెల్త్ ప్రత్యేక ప్రోగ్రాం ఈ నెల 27 నుంచి జూన్ 7వ తేదీ వరకు 12 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు యోగీ వేమన కేంద్ర గురువు యర్రంకాని రాంబాబు అన్నారు. మంగళవారం 10 రోజుల షెడ్యూల్ వివరాలను ఆయన వెల్లడించారు. 27న, గ్రామపంచాయతీలలో యోగా అవశ్యకతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 28న, ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రభుత్వ పాఠశాలలు బస్టాండ్‌లలో హరిత్ యోగ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 29న ప్రతిరోజు మాదిరిగానే ఉదయం 7 నుంచి 8 గంటల వరకు గ్రామ పంచాయతీలలో సమావేశం చిన్నారులు వృద్ధులకు యోగా సమావేశం నిర్వహిం చడం జరుగుతుందన్నారు. 30న, యోగా అన్‌ప్లగ్డ్ కార్యక్రమాన్ని 31న, యోగా ప్రభుత్వ ఆసుపత్రులలో యోగ అవశ్యకత గురించి వివరించడం జరుగుతుందని వెల్లడించారు.

జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

కృష్ణకాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29, 30, 31 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో ప్రధానంగా బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలన నాలగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తు ందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ నాలుగు కోడ్‌లు అమలుప రుస్తుందని, దీన్ని అడ్డుకునే విధంగా జాతీయ సంఘాలు పోరాటాలు చేస్తూనే రైతు చట్టాలను వ్యతిరేఖించిన విధంగా జాతీయ సంఘాలు పోరాటాలు చేయాలన్నారు. సింగరేణిలో ట్రాన్స్‌ఫర్స్ పాలసీలో అన్లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్ విధానం ఉండే విధంగా చూడాలన్నారు. కార్మికు హక్కులపై అనేక పోరాటాలు చేస్తూనే గుర్తింపు సంఘం కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హక్కులు వచ్చే విధంగా ఏఐటీయూసీ నిత్యం కార్మిక సమస్యలపై పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు .సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ రాజరత్నం, బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రాంచందర్, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ గురిజెపల్లి సుధాకర్‌రెడ్డి, మైనింగ్ సెంటర్ ఆర్గనైజర్ రాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలి

కాటారం, మే 27(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ అవార్డును అందుకుని తొలిసారిగా ఈ నెల 31న వరంగల్ రానున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఛలో వరంగల్ స్వాగత ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మంథెన శ్రీధర్, నాయకులు కరుణాకర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కృష్ణకాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిబంధనలు అతిక్రమించిన వాహనదారులను ఆపి మందలించారు. అలాగే, రోడ్డుకు మధ్యలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ క్రాస్ చేయడం మూలంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. అతివేగంతో వెళ్లవద్దని, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండాచూడాలని ఆయన సూచనలు చేశారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు

మంగపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) మంగపేట ఎంపీడీవో కార్యాలయంలో రెండోరోజు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి బ్యాంక్‌ల నుంచి రుణాలు మంజూరైన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలను అధికారులు మంగపేట యూనియన్ బ్యాంకర్లు నిర్వహించారు. ఎస్సీ లబ్ధిదారులు 108 మంది దరఖాస్తులు చేసుకోగా 92 మంది హాజరైనారని ఎంపీడీవో బి. భద్రు తెలిపారు. వారి వివరాలను ఎంపీడీవో వెల్లడించారు. ఎస్టీలలో 88 మంది దరఖాస్తులు చేసుకోగా 66 మంది హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారన్నారు. బీసీలలో 261 మంది దరఖాస్తులు చేసుకోగా 189 మంది హాజరుకాగా 72 మంది గైర్హజర య్యారు. ఈబీసీలో 10 మంది దరఖాస్తులు చేసుకోగా 9 మంది హజరైనారని ఒకరు మాత్రం గైర్హజర య్యారు. మైనార్టిలు 9 మంది దరఖాస్తులు చేసుకోగా ఏడుగురు హాజరుకాగా ఇద్దరు గైర్హజరైనట్లు తెలిపారు. మొత్తం మంగపేట యూనియన్ బ్యాంక్ పరిధిలో 476 మంది దరఖాస్తులు చేసుకోగా 363 మంది హజరు కాగా 113 మంది గైర్హజరయ్యారని ఎంపీడీవో భద్రూ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

కాటారం, మే 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలు 50శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్ఎంఎస్ పూర్ణిమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, దామెరుకుంటలోని డీసీఎంఎస్ కేంద్రంలో జీలుగ, జనుము విత్తనాల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ జీలుగలు సాగుచేసుకుని పూత దశకు ముందు భూమిలో కలియదున్నుకోవాలన్నారు. 30కిలోల బరువు గల బస్తాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తాకు రాయితీ పోనూ జీలుగ విత్తనాలకు కిలోకు రూ.71.25, జనుములకు కిలోకు రూ.62.75 రైతులు చెల్లించాలన్నారు.



ఆగ్రోస్‌లో ఉన్న ఎరువులు


● వెంకటాపురం, మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్ కాపీ అందజేసి తీసుకోవాలన్నారు. జీలుగ విత్తనాలు 30కిలోల బస్తా రూ.2137, జనుము 40కిలోల బస్తా రూ.2510తో అందుబాటులో ఉన్నాయని అన్నారు.

పుష్కరాల్లో కుల వివక్షపై మాట్లాడడం సరికాదు ..

కాటారం, మే27(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో గుర్తుకు రాని కుల వివక్షను, మంథని నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పుష్కరాల్లో దానిపై మాట్లాడటం శోచనీయమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. దశాబ్దాలుగా కాకా వెంకటస్వామి కుటుంబం ఎన్నో మార్లు ఎంపీగా గెలిస్తే కనిపించని కుల వివక్ష వంశీకృష్ణ ఎంపీగా గెలిచిన అనంతరం ధనం కన్నా కులం గొప్పదని గుర్తించామనడం హాస్యాస్పదమన్నారు. ఇటీవల ఒడిషాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసిన ఎంపీ కుటుంబం తెలంగాణలో ఎందుకు ఏర్పాటు చేయలేదో, ఈ ప్రాంత తమ సామాజికవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

మంగపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంగపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణంలో సంఘం మండల జనరల్ బాడి సమావేశం గడ్డం భారతి అధ్యక్షతన జరుగగా ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జంపాల రవీం దర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల కేంద్రప్రభుత్వంపై వంట కార్మికులు సమరశీల ఉద్యమాలు నిర్వహించాల్సి ఉంటుందని రవీందర్ హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాళ్లు గడ్డం భారతి కురుసం రాజకు మారి కోరేం పద్మ బండి జయమ్మ కొడాలి తులసి పయింబీ సిర్ర సమ్మక్క షఫీయాబీ అఖీల రేస పాపమ్మ తగికెల సత్యవతి కర్రె సుశీల జోగ దీవ్యభారతి పొడెం సమ్మక్క కారం కుమారి చౌలం సుశీల ఇర్ప సమ్మక్క వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



వంట కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న జంపాల రవీందర్

ఆరోగ్య మహిళా కేంద్రాలను వినియోగించుకోవాలి

వెంకటాపూర్, మే 27, (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు డీఎంహెచ్‌వో గోపాలరావు అన్నారు, మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కేంద్రంలో ఉదయం 9 గంటలకే ప్రారంభించాలని సూచించారు. కేంద్రంలో సూమారు 60 నుంచి 80 మంది మహిళలను పరీక్షించాలని, కేంద్రంపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. మంగళవారం ఈ కేంద్రంలో 88 మందిని మహిళలను పరీక్షించా మన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రిషిత, పీహెచ్ఎన్ శోభ, ఎఎన్ఎం కనకలక్ష్మీ, ఫార్మసిస్టు రాజమణి, ఆశాలు సంధ్య, రాణి, తదితరులు ఉన్నారు.



క్లీనిక్‌లో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

కృష్ణకాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొరియర్, హోమ్ సర్వీసెస్, ఫుడ్ డెలివరీ, ఏసీ టెక్నిషియన్స్, డిజనర్స్, వీడియో ఎడిటర్స్ వంటివిధులు చేసేవారు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారిని వినోద మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జోమాటో, స్విగ్గి, వంటి సంస్థలో పని చేసే వారిని కార్మికలుగా గర్తిస్తూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఏదేని సందేహాలకు 14434 అనే హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏటూరునాగారం, మే 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో గత కొన్ని నెలలుగా పోలీసుల కళ్లు కప్పి పేకాట ఆడుతున్న స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన కథనం మేరకు.. సోమవారం రాత్రి ఏటూరునాగారంలో పేకాట ఆడుతున్నరన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మండల కేంద్రానికి చెందిన ఇర్సవడ్ల వెంకన్న, సునారికాని నాగరాజు, బొచ్చు వెంకటేశ్వర్లు, పెద్దల సూర్యనారాయణ, చెన్నూరి బాలరాజులు పట్టుబడ్డారన్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 9,980 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమెదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయిలో గల తెలంగాణ మోడల్‌స్కూల్/కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు ఎంఎస్సీ(ఫిజిక్స్) బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గండు కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారు 9,10, ఇంటర్మీడియట్ తరగతులు బోధించాల్సి ఉంటుందని, పీరియడ్ ప్రాతిపదికన సగటు మొత్తంగా నెలకు రూ.18,200 చెల్లించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు ఈనెల 28నుంచి జూన్ 5వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 6వతేదీన ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని, పూర్తి వివరాలకు 8096350115 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. మోడల్‌స్కూల్, జూని యర్ కళాశాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మెరిట్ ఆధారంగా విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈనెల 29 నుంచి జూన్ 2వరకు అడ్మిషన్ పొందాలన్నారు.

తహసీల్దార్ కు సన్మానం

కన్నాయిగూడెం ,మే 27 (ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్‌డీ సర్వర్‌పాషాను మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్ పాషా ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోట నాగేష్ , కుమ్మరి వెంకట్, మాదాసు రాంజెందర్, పవన్ కుమార్ , వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడు లారీ బోల్తా

తాడ్వాయి, మే 27, (ఆంధ్రజ్యోతి): ధాన్యం బస్తాల లోడు లారీ బోల్తా పడిన సంఘటన తాడ్వాయి మండల శివారులోని పస్రా మార్గమధ్యలో 163 జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం తాడ్వాయి మండలం ఇందిరానగర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి చెందిన రైతుల దాన్యాన్ని నిర్వహకులు మిల్లర్లకు తరలిస్తున్న క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. అయితే డ్రైవరు లారీ మోతాదుకు మించి అధికలోడు చేయించడమే కారణమని రైతులు వాపోతున్నారు. సూమారు 800 బస్తాలు తరలించాల్సిన లారీలో 1000 బస్తాలు తరలించడంతో ఈ ప్రమాదం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు.



బోల్తా పడిన లారీ ఇదే

సింగరేణి ఏరియా జాగృతి కో ఆర్డినేటర్‌గా నరేష్

కృష్ణకాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి భూపాలపల్లి సింగరేణి ఏరియా కోర్డినేటర్‌గా నరేష్ నేత నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశంలో 11 ఏరియాలకు నూతన కో ఆర్డినేటర్‌లను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేయగా భూపాలపల్లి ఏరియాకు నరేష్ నేతకు అవకాశం దక్కింది. సింగరేణి ఏరియాల్లో ఇక నుంచి జాగృతి తరపున సైతం వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా కవిత వారికి దిశానిర్దేశం చేశారు. తనపై నమ్మకంతో కో ఆర్డినేటర్‌గా నియమించిన ఎమ్మెల్సీ కవితకు నరేష్ నేత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన యువ వికాసం ఇంటర్వ్యూలు

వాజేడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం ఇంటర్వ్యూలు రెండురోజులపాటు జరిగాయి. మంగళవారం ఎస్‌బీఐ, జీసీసీ బ్యాంకుల ఆధ్వర్యంలో అర్హత సాధించిన లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు, ఎంపీడీవో ఇంటర్వ్యూ నిర్వహించారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న యూనిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిక కాని అభ్యర్థుల వివరాలను మళ్లీ నమోదు చేసుకుం టామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదని సూచించారు. వారికి సంబం ధించిన వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విజయ, ఆయా బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 802 మంది హాజరు

వెంకటాపూర్ : రాజీవ్ యువవికాసం పేరుతో సబ్సిడీ రుణాలను అందజేయనున్న క్రమంలో మండల వ్యాప్తంగా 1136 దరఖాస్తులు వచ్చాయని అందులో ఇంటర్వ్యూలకు 802 మంది లబ్ధిదారులు హాజరైనట్లు మండల ఎంపీడీవో మూడ్ రాజునాయక్ తెలిపారు. వెంకటాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 890 మందికి 626 మంది హజరైయ్యారని, అలాటే గణపురం యూబీఐ బ్యాంకులో 246 మందికి 176 మ

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యాధికారి జ్యోతి మంగళవారం 87మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. వైద్యాధికారులు వినయ్, పవన్, హెచ్‌ఈవో సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ యాకలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల ఇంటర్వ్యూల ఆహ్వానం

చిట్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం జోన్ పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తించేందుకు అర్హులు ములుగు జిల్లా జాకారంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గురుకులాల సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి ప్రకటనలో కోరారు. చిట్యాల (బాలికలు), ములుగు జిల్లాలోని జాకారం (బాలురు), ఏటూరునాగారం (బాలురు), ములుగు (బాలికలు) పాఠశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, హిందీ, ఇంగ్లీషు, హెల్త్ సూపర్వైజర్ పోస్టులకు ఈనెల 28, గణితం, సైన్స్, సోషల్‌స్టడీస్, లైబ్రేరియన్ పోస్టులకు ఈనెల 29న పాఠ్యాంశ బోధన ఉంటుందని తెలిపారు. అర్హులు ఉదయం 9గంటలలోపు ములుగు జిల్లా జాకారం గురుకుల పాఠశాలలో హాజరుకావాలని తెలిపారు.